సాక్షి విశాఖపట్నం
బుధవారం । 3 । జనవరి । 2024



మభ్యపెట్టి.. వంచించి..
మైనర్‌పై లైంగిక దాడి కేసులో పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 8లో



చేనేత వస్త్రాలు ధరించాలి
స్వదేశీ వస్తువులను వినియోగించి..చేనేతను ప్రోత్సహించాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. 8లో

మరో ఐదుగురికి కరోనా



విశాఖలో మంగళవారం ఐదుగురికి కరోనా సోకింది. 25 మంది హోమ్ ఐసోలేషన్‌లో, ఐదుగురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా 13 మంది డిశ్చార్జ్ అయ్యారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

కన్వెన్షన్ సెంటర్ విత్ ఫైవ్ స్టార్ హోటల్!

- ఎండాడలో నిర్మించేందుకు సిద్ధమవుతున్న ఏపీటీడీసీ
- పీపీపీ విధానంలో డెవలపర్ కోసం ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లకు ఆహ్వానం
- 2.33 ఎకరాల్లో వరల్డ్ క్లాస్ కన్వెన్షన్ సెంటర్
- రూ.96.42 కోట్లతో నిర్మాణానికి ప్రణాళికలు
- టూరిజం పాలసీ 2020–25 ప్రకారం కేటాయింపు
- 33 ఏళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయం





కన్వెన్షన్ సెంటర్ విత్ ఫైవ్ స్టార్ హోటల్ నమూనా

సాక్షి, విశాఖపట్నం : సహజ అందాలతో అలరారే ఉత్తరాంధ్ర పర్యాటకాన్ని కొత్త పుంతలు తొక్కేందుకు సరికొత్త ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఒకవైపు సాగర సోయగాలు.. మరోవైపు ఎత్తైన తూర్పు కనుమల అందాలు ప్రపంచ పర్యాటకులను కట్టిపడేస్తుండగా.. ప్రపంచ పర్యాటక పటంలో టూరిజం రాజధానిగా భాసిల్లే విధంగా కొత్త ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇస్తోంది. ఇందులో భాగంగా సాగరతీరంలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్టార్‌హోటల్‌తో కూడిన కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. పీపీపీ విధానంలో ఈ ప్రాజెక్టు నిర్మించేందుకు ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు ఆహ్వానించింది. రూ.96 కోట్లతో ఎండాడ సమీపంలో 2.33 ఎకరాల విస్తీర్ణంలో వరల్డ్ క్లాస్ కన్వెన్షన్ సెంటర్ రానుంది.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా జిల్లాలో ఉన్న అపార అవకాశాలను మెరుగు పరుచుకొని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనులకు రూపకల్పన జరుగుతోంది. విశాఖ జిల్లానూ పర్యాటక ఖిల్లాగా మార్చే దిశగా.. టూరిజం ప్రాజెక్టులకు కసరత్తు చేస్తున్నారు. మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో జరిగిన పర్యాటక ఒప్పందాల్లో సింహభాగం ఇన్వెస్టర్లు విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలను ఎంపిక చేసుకున్నారు. ఉమ్మడి విశాఖతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పర్యాటక అవకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతి ప్రాంతంలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. జీఐఎస్‌లో పర్యాటక రంగానికి సంబంధించి రూ.8,806 కోట్లతో 64 ప్రాజెక్టులు ఉత్తరాంధ్రకు రానున్నాయి. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో వరల్డ్ క్లాస్ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు అడుగులు పడుతున్నాయి.

ఎండాడలో..

సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోంది. ఇందుకు కీలకంగా ఉన్న పర్యాటక రంగం ఉపాధి అవకాశాలకు, ఆర్థిక వ్యవస్థకు ఇంజన్‌లా వినియోగించుకోవాలని నిర్ణయించింది. అందుకే.. ప్రపంచస్థాయి లగ్జరీ రిసార్టులు, ఫైవ్‌స్టార్ హోటల్స్, కన్వెన్షన్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ నేపథ్యంలోనే సాగరతీరంలో ఎండాడ సమీపంలో అత్యాధునిక సౌకర్యాలతో అంతర్జాతీయ ప్రమాణాలతో కన్వెన్షన్ సెంటర్, ఫైవ్‌స్టార్ హోటల్ ఏర్పాటు చేయాలని ఏపీటీడీసీ నిర్ణయించింది. ఈ ప్రాజెక్టును పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో డిజైన్, ఫైనాన్స్, బిల్డ్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్(డీఎఫ్‌బీవోటీ) విధానంలో డెవలపర్ కోసం ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు ఆహ్వానించింది.

స్టార్ హోటల్‌తో కూడిన భారీ కన్వెన్షన్ సెంటర్

ఎండాడలోని సర్వే నంబర్ 106/1లో 1.78 ఎకరాలు, 106/4లో 0.55 ఎకరాలు మొత్తం 2.33 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు రాబోతోంది. మొత్తం రూ.96.64 కోట్ల అంచనా వ్యయంతో పీపీపీ విధానంలో కింద కన్వెన్షన్ సెంటర్, పైన ఫైవ్‌స్టార్ హోటల్‌ను నిర్మించనున్నారు. బిడ్డింగ్ ప్రాసెస్ మొదలు పెట్టిన 36 నెలల్లో పూర్తి చేయాలనే టార్గెట్‌తో ప్రాజెక్టును అప్పగించనున్నారు. 2020–25 టూరిజం పాలసీలో విధానాలను అనుసరిస్తూ.. 33 ఏళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు కూడా సదరు టెండర్లు దక్కించుకున్న సంస్థే చూసుకోవాలి. వార్షిక రెవెన్యూ షేర్ 8 శాతంగా నిర్ణయించారు. ఈ నెల 22న బిడ్స్ తెరవనున్నారు. ఈ ప్రాజెక్టు పట్టాలెక్కితే.. విశాఖ పర్యాటకం మరింత వరల్డ్ క్లాస్‌గా మారబోతోంది. విశాఖ తీరానికి ఈ కన్వెన్షన్ సెంటర్ విత్ ఫైవ్‌స్టార్ హోటల్ ప్రాజెక్టు మరో మణిహారం కానుందని పర్యాటక వర్గాలు చెబుతున్నాయి.

అమితానందం

- ఇచ్చిన మాట ప్రకారమే రూ.3వేల పెన్షన్
- పంపిణీ చేసిన కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు.చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున



పెన్షన్ పెంపు ఉత్సవంలో పాల్గొన్న లబ్ధిదారులు

ఆనందపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దశలవారీగా పెంచిన పెన్షన్ మొత్తం పేదలకు ఆసరాగా నిలుస్తోందని కలెక్టర్ డా.మల్లికార్జున చెప్పారు. మండలంలోని గిడిజాలలో మంగళవారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెన్షన్ పెంపు ఉత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా ఇచ్చిన మాట ప్రకారం రూ.2 వేలు నుంచి రూ.3 వేలు వరకు పెన్షన్లు పెంచిందన్నారు. దీని వలన ప్రతినెలా పేదలకు, ఎటువంటి ఆసరా లేని వారికి ఆర్థిక భరోసా లభిస్తోందని చెప్పారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెన్షన్ల మొత్తాలను రూ.3000కు పెంచి అవ్వ, తాత, వితంతువుల మనసు గెలుచుకున్నారన్నారు. టీడీపీ పాలనలో 29 లక్షలు ఉన్న పెన్షన్లను 66 లక్షలకు పెంచిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని చెప్పారు. దేశంలోనే అత్యధికంగా 66 లక్షల పెన్షన్లు ప్రతినెలా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మాదేనని వివరించారు. గత ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఓట్లు కోసం పెన్షన్ల మొత్తాలను పెంచుతామని చెప్పినా ప్రజలు ఎవరూ నమ్మలేదన్నారు. నేడు పార్టీలకతీతంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అర్హత గల ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందిస్తున్నామని గుర్తు చేశారు. ఒకటో తేదీనే వలంటీర్లు తలుపుతట్టి మరీ పెన్షన్లు అందజేస్తున్నారని వివరించారు. కులం పేరుతో జనసేన పార్టీ వస్తోందని ఆ పార్టీ మాయలో పడితే రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కి వెళ్లిపోతుందన్నారు. అన్ని వర్గాలకు సమ న్యాయం కావాలన్నా, అందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే తిరిగి సీఎంను చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అడపా లవరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్ షిణగం అప్పలరాజు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, నాయకులు కోరాడ మసలినాయుడు, బొట్టా రామకృష్ణ, లెంక రాంబాబు, బీఆర్‌బీ నాయుడు, గొలగాని కృష్ణ, కోరాడ వెంకట రమణారావు, పినిశెట్టి సింహాచలం నాయుడు, డోల దేవుడు, కోరాడ గిరిరాజు, కోరాడ అప్పలస్వామి నాయుడు, షిణగం రాంబాబు, కోండ్రోతు అప్పలనారాయణ, గొంప సన్యాసిరావు, పడాల రాము, గుసిడి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద దిక్కుగా నిలిచిన జగన్



నాకు వివాహం అయి చాలా కాలమైంది. అప్పట్లోనే భార్య, కుమారుడు విడిచి పెట్టి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఒంటరిగా బతుకుతున్నా. ఉండడానికి ఇల్లు లేదు. వయసు పెరగడంతో కూలికి కూడా వెళ్లలేని పరిస్థితి. దీంతో తమ్ముడు కుమారుడు గంగయ్య ఇంట్లో తలదాచుకుంటున్నాను. నాకు వచ్చే పెన్షను మూడు వేలకు పెరిగింది. చాలా ఆనందమేసింది. ఏ ఆదాయం లేని నాకు జగన్ కొడుకుగా పెద్ద దిక్కయ్యాడు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాను.

– జాడ పైడయ్య, పేకేరు.

భరోసా కల్పించారు



నేను, భర్త వృద్ధాప్యంలో ఉన్నాం. కూలి పనికి వెళ్లలేని పరిస్థితి. మాకు ముగ్గురు కుమారులు .. వీరిలో ఇద్దరికి మతిస్థిమితం లేదు. వారిని ఇంటి వద్దే ఉంచి చూసుకోవలసిన పరిస్థితి. మా పెద్ద కుమారుడు దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. ఆ డబ్బులు ఎటూ సరిపోవడం లేదు. ఇప్పుడు రూ.3000 పెన్షను అందుతోంది. దీంతో మా ఇంటి నెల ఖర్చులకు ఢోకా లేకుండా ఉంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– పచ్చికూర కనకమ్మ, దబ్బంద

8వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ

మహారాణిపేట: వైఎస్సార్ పింఛన్ కానుక బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా అందించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జనవరిలో 2,350 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేశారు. జిల్లాలో మొత్తం పెన్షనర్లు (కొత్త, పాతవి) 1,60,829 మంది ఉన్నారు. వీరికి రూ.50.38 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ మొత్తాన్ని మంగళవారం బ్యాంకుల నుంచి అధికారులు డ్రా చేశారు. డ్రా చేసిన సొమ్మును సంబంధిత అధికారుల ద్వారా వలంటీర్లకు అప్పగించారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి పింఛను పంపిణీ మొదలవుతుందని, 8వ తేదీ వరకూ కొనసాగుతోందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి శోభారాణి తెలిపారు. ఇదిలా వుండగా సిరిపురం చిల్డ్రన్స్ ఏరియాలో పింఛన్లు పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఈ కార్యక్రమం మొదలవుతుంది.

న్యూస్‌రీల్

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్ : బీఈ, బీటెక్ డిగ్రీ అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉచిత శిక్షణ ఇవ్వనునట్టు సెమ్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ గోపీకృష్ణ శివ్వం, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, భారత ప్రభుత్వ సంస్థ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్ (సెమ్స్) సంయుక్తంగా సీడాప్ దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకంలో 21నుంచి 27 ఏళ్ల వయసున్న నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. బీఈ, బీటెక్ మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రా నిక్స్, ఆటోమొబైల్స్ ఇంజినీరింగ్ కోర్సులో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతకు ప్రొడక్ట్ డిజైన్ ఇంజినీర్(30 సీట్లు), మెకా ట్రానిక్స్ డిజైనర్ అండ్ సిస్టం ఇంటిగ్రేటర్ ఇంజినీర్(30 సీట్లు) కోర్సుల్లో 3 నుంచి 5 నెలలపాటు ఉచిత భోజనం వసతి కల్పించి శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. మరిన్ని వివరాలకు 85006 87750 నంబరులో సంప్రదించవచ్చు.

నేటి నుంచి చిన్నారులకు ప్రత్యేక యోగా శిబిరం



ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో జనవరి 3 నుంచి జనవరి 12వ తేదీ వరకు చిన్నారుల కోసం సాధారణ యోగా, స్థూలకాయ నివారణకు ప్రత్యేక యోగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భానుకుమార్ తెలిపారు. 8 నుంచి 14 మధ్య వయసున్న చిన్నారులు ఈ శిబిరంలో పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తి కలిగిన వారు 94944 01919, 93980 19922, 99854 56150 సంప్రదించాలని సూచించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు చిన్నారుల యోగ తరగతులు జరుగుతాయన్నారు.

పంజాబ్ సీఎంతో అమర్‌నాథ్ భేటీ

మహారాణిపేట: పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌ను రాష్ట్ర పరిశ్రమలు,ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నగరంలో ఓ హోటల్‌లో బస చేసిన ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున మంత్రి అమర్‌నాథ్ మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక అందజేశారు.

పేదలకు వరం జగనన్న ‘ఆరోగ్య సురక్ష’

- రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి



శిబిరంలో పాల్గొన్న రోగులు



రోగికి మందుల బ్యాగ్‌ను అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల వారికి వైద్య సేవలు గణనీయంగా మెరుగుపడ్డాయని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున చెప్పారు. మండలంలోని వెల్లంకిలో మంగళవారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ రెండు మాసాల క్రితం నిర్వహించిన ఆరోగ్య సురక్ష మొదట విడత కార్యక్రమం ద్వారా 414 వైద్య శిబిరాలు నిర్వహించి సుమారు 2 లక్షల మందికి వైద్య సేవలు అందించామని చెప్పారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని ఇంటింటికీ వెళ్లి రోగులను గుర్తించి వైద్యం అందించామన్నారు. రోగులను ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు తరలించి మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. శస్త్ర చికిత్సలు చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న రోగులకు 10 రోజులు వరకు ఆరోగ్య ఆసరా కార్యక్రమం కింద రూ.2,250 ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. గతంలో గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు తక్కువగా ఉండేవని ..నేడు ప్రతి సచివాలయం పరిధిలో ఆరోగ్య కేంద్రంతో ఏర్పాటుతో పాటు సిబ్బందిని నియమించి వైద్య సదుపాయాలు, మందులను అందుబాటులో ఉంచామన్నారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో వైద్యం అందక పేదలు చనిపోతున్న పలు సంఘటనలు చూసి ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత విస్తరించారన్నారు. ప్రస్తుతం ప్రతి పేదవాడు రూ.25 లక్షలు వరకు ఉచిత వైద్యం పొందే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో జగనన్న ఆరోగ్యశ్రీ కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందన్నారు.

శిబిరానికి వచ్చిన రోగులకు కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి పి.జగదీశ్వరరావు నోడల్ అధికారి ఉమావతి, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, నాయకులు పిన్నింటి వెంకట రమణ, కాకర వెంకట రమణ, చెన్నా సత్యం, చందక అప్పలస్వామి, కె.చంద్రమౌళి, పడాల రాము, వైద్యాధికారి గంగునాయుడు పాల్గొన్నారు.

2,112 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ముంగళవారం ప్రారంభమైంది. పద్మనాభం మండలం అయినాడ, ఆనందపురం మండలం వెల్లంకి, భీమిలి మండలం చిప్పాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో నిర్వహించిన శిబిరాల్లో 2,112 మందికి వైద్య సేవలందించారు. ఇందులో ఆరుగురిని వివిధ కార్పొరేట్ ఆస్పత్రులకు సిఫారసు చేసినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. అర్బన్ ప్రాంతంలోని తోటవీధి(భీమిలి), చినముషిడివాడ, బుచ్చిరాజుపాలెం, గాజువాక, దేవాడ, ఏకేసీ కాలనీ, అంబేడ్కర్ కాలనీ, రైల్వే న్యూకాలనీ, కొబ్బరితోట, ఎన్‌జీజీవో కాలనీ, స్వతంత్ర నగర్, దండుబజార్‌లో బుధవారం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

పెట్రోల్ బంకులకు పోటెత్తిన జనం



ఆయిల్ ట్యాంక్ డ్రైవర్ల ఆందోళనల నేపథ్యంలో మంగళవారం నగరంలోని గోపాలపట్నం, మర్రిపాలెం ప్రాంతాల్లో పెట్రోల్ బంకులకు వాహనచోదకులు పోటెత్తారు. పెట్రోల్ బంకులు బంద్ అవుతాయన్న ప్రచారంతో ఒక్కసారిగా బారులుదీరారు. అయితే బంకుల యాజమాన్యాలు మాత్రం అసలు ఎందుకు ఒక్కసారిగా ఇంత రద్దీ పెరిగిందో తెలియలేదన్నారు. బంక్‌ల బంద్‌పై తమకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు. కాగా.. వాహనాల ట్యాంక్‌లు ఫుల్ చేసుకున్న పలువురు వాహన చోదకులు..బాటిళ్లలో కూడా నింపి తీసుకెళ్లడం గమనార్హం. – మర్రిపాలెం/గోపాలపట్నం

6న శ్రీ నృసింహ దీక్షల విరమణ

- ఉదయం 7 గంటల నుంచి ప్రారంభం
- దీక్షాధారులకు దేవస్థానం బస్సుల్లో ఉచిత ప్రయాణం, భోజన వసతి


ఏర్పాట్లపై చర్చిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరిపై ఈ నెల 6న శ్రీ నృసింహ దీక్షల విరమణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సంబంధిత ఏర్పాట్లపై మంగళవారం దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, వైదికులు, అధికారులతో ఈవో చర్చించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 41 రోజుల మండల దీక్ష, 32 రెండు రోజుల దీక్ష తీసుకున్న వారంతా ఈ నెల 6న దీక్ష విరమింపజేయాలని సూచించారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని.. ఆ సమయానికి దీక్షాధారులంతా సింహగిరికి చేరుకోవాలని సూచించారు. దీక్షాధారులకు 6న కొండదిగువ నుంచి సింహగిరికి, సింహగిరి నుంచి కొండ దిగువకి దేవస్థానం బస్సులో ఉచితంగా అనుమతిస్తామన్నారు. దీక్ష విరమణ అనంతరం ఉచితంగా స్వామి దర్శనం కల్పించి.. అన్న ప్రసాద విభాగంలో భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. దూర ప్రాంతాల 5వ తేదీ రాత్రికే చేరుకునే వారికి వసతి, భోజన సదుపాయం ఉచితంగా కల్పిస్తామన్నారు. దీక్షాధారులంతా ఈ విషయాలను గమనించాలని కోరారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈవో భ్రమరాంభ, సూపరింటెండెంట్ వెంకటరమణ, పీఆర్వో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేపగుంటలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

- విగ్రహం కుడిచేతిని విరగ్గొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు


వైఎస్సార్ విగ్రహం చేతిని విరగ్గొట్టిన దుండగులు

పెందుర్తి: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహంపై దుండగులు దాడికి పాల్పడ్డారు. పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ 94వ వార్డు వేపగుంట కూడలి వద్ద డాక్టర్ వైఎస్సార్ విగ్రహం కుడి చేతిని దుండగులు విరగ్గొట్టారు. అనంతరం విగ్రహానికి ముసుగు వేశారు. మంగళవారం వెలుగుచూసిన ఈ ఘటనపై ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సూచన మేరకు వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుల కోసం పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పెందుర్తి నియోజకవర్గంలోని జనసేన, టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే దుండగులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆరోపిస్తున్నారు. ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీని ఎదుర్కోలేకే ఇలాంటి నీచమైన చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

రోడ్డు ప్రమాదంలో విదేశీ విద్యార్థి మృతి


గాయపడిన విద్యార్థిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

సీతమ్మధార: రోడ్డు ప్రమాదంలో విదేశీ విద్యార్థి మృతి చెందాడు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. సుడాన్ దేశానికి చెందిన బిలాల్ (21) రెండేళ్ల కిందట విశాఖలో చదువుకోవడానికి వచ్చాడు. ఆంధ్ర యూనివర్సిటీలో బి.టెక్ చదువుతున్నాడు. కాంప్లెక్స్ నుంచి రైల్వేస్టేషన్‌కు మంగళవారం వెళ్తున్న సమయంలో భిక్షాటన చేస్తున్న వ్యక్తిని బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని పోలీసులు, స్థానికులు కేజీహెచ్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు అతని మృతదేహాన్ని తరలించారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మభ్యపెట్టి.. వంచించి..



- మైనర్‌పై లైంగిక దాడి కేసులో సంచలన విషయాలు
- 11 మంది అరెస్ట్.. ఈ నెల 12 వరకు రిమాండ్
- పరారీలో ప్రియుడు ఇమ్రాన్, అతని స్నేహితుడు సోహెబ్
- వారి కోసం రెండు బృందాలతో పోలీసుల గాలింపు

విశాఖ సిటీ: బాలికపై లైంగిక దాడి కేసులో పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అడుగడుగునా మభ్యపెట్టి.. వంచించిన ఈ ఘటనలో 11 మంది నిందితులను మంగళవారం అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. ఇందులో మరికొంత మంది పాత్ర ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

పుట్టిన రోజు నాడే..

ఒడిశాకు చెందిన కుటుంబం పొట్టకూటి కోసం విశాఖకు వచ్చి కంచరపాలెం ప్రాంతంలో నివాసముంటోంది. 16 ఏళ్ల మైనర్‌ను నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో పనికి పెట్టారు. ఆమెకు అక్కడే ఇమ్రాన్‌తో పరిచయం ఏర్పడింది. డిసెంబర్ 17న ఆమె పుట్టిన రోజు కావడంతో ఆ రోజు సాయంత్రం 5 గంటలకు ఇమ్రాన్‌తో కలిసి బీచ్‌లో బర్త్‌డే చేసుకోవడానికి వెళ్లింది. అక్కడ వేడుకలు చేసుకున్న తర్వాత మాయమాటలు చెప్పి రాత్రి 10 గంటలకు ఇమ్రాన్‌తో పాటు అతని స్నేహితుడు సోహెబ్ ఒక లాడ్జికి తీసుకెళ్లి ఇద్దరూ ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. తర్వాత రోజు వారి స్నేహితుడు లాడ్జికి వచ్చి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. మరుసటి రోజు 18వ తేదీ ఉదయం 5 గంటలకు ముగ్గురూ లాడ్జి నుంచి బయటకు వచ్చారు. ఆమెను 5.30 గంటలకు తన ఇంటి దగ్గర వదిలేసి వెళ్లిపోయారు. బాలిక మనస్తాపంతో ఇంటికి వెళ్లకుండా ఆర్కే బీచ్‌కు వద్ద ఉన్న గోకుల్ పార్కుకు చేరుకుంది.

ఫొటోలు పేరుతో ట్రాప్ చేసి..

ఉదయం 9 గంటల సమయంలో బీచ్ ఉన్న మైనర్‌ను బీచ్ ఫొటోగ్రాఫర్లు సయ్యద్ మీరా షరీఫ్ అలియాస్ చెర్రీ, హరీష్ , నాగేంద్ర, గోపీలు గమనించారు. ఆమెకు ఫొటోలు తీసి మాటలతో ట్రాప్ చేశారు. ఉదయం 10.30 గంటలకు నాగేంద్ర, చెర్రీలు బాలికను ద్విచక్ర వాహనంపై ఒక లాడ్జికి తీసుకువెళ్లారు. లాడ్జి వద్ద అప్పటికే గోపీ, హరీష్‌లు సిద్ధంగా ఉన్నారు. లాడ్జిలో నలుగురు ఆ రోజంతా లైంగిక దాడికి పాల్పడ్డారు. 19వ తేదీ రాత్రి వారి స్నేహితులు శ్రీను, అశోక్, నరేష్ లాడ్జికి వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న బాధితురాలిపై పైశాచికంగా ప్రవర్తించారు. 20న మరో ఇద్దరు తాంబే, ఈశ్వర్ కూడా వచ్చి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. 21వ తేదీన బాలికను మరో లాడ్జికి తీసుకువెళ్లి నాగేంద్ర, హరీష్‌తో పాటు మరో ఇద్దరు ప్రవీణ్, శివ కూడా ఆమెపై పశుత్వాన్ని ప్రదర్శించారు. 22న ఆమె పరిస్థితి దారుణంగా మారి కడుపు నొప్పితో బాధపడుతూ తనను ఏమీ చేయవద్దని, తన ఊరికి తీసుకువెళ్లాలని ప్రాధేయపడింది. దీంతో అదే రోజు చెర్రీ ఆమెను ఒడిశాలోని బరంపురానికి బస్సులో తీసుకువెళ్లి పునుకొల్లి పోలీస్ స్టేషన్ వద్ద విడిచిపెట్టి ఆమె చేతిలో రూ.200 పెట్టి వచ్చేశాడు.

ఒడిశా పోలీసులు గమనించి..

అనారోగ్యంతో ఉన్న మైనర్‌ను గమనించిన అక్కడి పోలీసులు హోమ్‌కు తరలించి ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అప్పటికే బాలిక తల్లిదండ్రులు తమ కుమార్తె కనిపించడం లేదంటూ డిసెంబర్ 17న నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఒడిశా పోలీసుల నుంచి సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులతో పాటు పోలీసులు కూడా అక్కడికి వెళ్లి బాధితురాలిని విశాఖకు తీసుకువచ్చారు. జరిగిన విషయంపై ఆమెను ప్రశ్నించినప్పటికీ మానసికంగా కుంగిపోవడంతో అసలు విషయాన్ని చెప్పలేకపోయింది. దీంతో పోలీసులు ఆమెను తల్లిదండ్రులకు అప్పగించి ఇంటికి పంపించారు. అయితే ఈ నెల 31న బాలిక జరిగిన అసలు విషయాన్ని తల్లిదండ్రులకు రోదిస్తూ వివరించింది. దీంతో వారు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు వెంటనే అదృశ్యం కేసును పోక్సో కేసుగా మార్చారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు దిశ పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. ఆమె చెప్పిన వివరాల ప్రకారం.. లాడ్జిలు, వెళ్లిన ప్రాంతాల్లో సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. దాని ప్రకారం 11 మంది నిందితులను గుర్తించి పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. అయితే బాలిక ప్రియుడు ఇమ్రాన్, అతని స్నేహితుడు సోహెబ్ పరారీలో ఉన్నారు. వారి కోసం రెండు ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలిస్తున్నారు. మంగళవారం వారి స్నేహితులు ఇద్దరిని స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. బాధితురాలిని కేజీహెచ్‌లో వైద్య పరీక్షలు చేయించి అనంతరం మహిళా సంరక్షణ కేంద్రానికి తరలించారు.

వారంలో ఒక్క రోజైనా చేనేత వస్త్రాలు ధరించాలి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


పోచంపల్లి శారీని ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


వస్త్రాలను పరిశీలిస్తున్న మహిళ

మధురవాడ: స్వదేశీ వస్తువులను వినియోగించి.. తయారీదారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మధురవాడ శిల్పారామం జాతరలో మంగళవారం అఖిల భారత చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు కనీసం వారంలో ఒక్క రోజు అయినా చేనేత వస్త్రాలు ధరించాలన్నారు. తద్వారా చేనేత వృత్తిదారులకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఎగ్జిబిషన్‌లో భాగంగా దేశం నలుమూలల నుంచి 100 మంది పైన చేనేత కళాకారులు 75 స్టాళ్లు ఏర్పాటు చేశారు. తెలంగాణ పోచంపల్లి, బిహార్ భాగల్‌పురి చీరలు, ఉప్పాడ, ధర్మవరం, సిద్ధిపేట కాటన్, పెద్దాపురం అండ్ కుప్పడం సిల్క్, గద్వాల్ సిల్క్, వరంగల్ డ్రస్ మెటీరియల్, కశ్మీరి సిల్క్, చీరాల హ్యాండ్‌లూమ్స్ అండ్ డ్రస్ మెటీరియల్, మంగళగిరి, వెంకటగిరి జరీ చీరలు, మచిలీపట్నం, కడప కాటన్ ప్రింటెడ్ టవల్స్ అండ్ లుంగీలు, నారాయణపేట, పొందూరు ఖాదీ, ఉత్తరప్రదేశ్ బెడ్ షీట్స్, మధురై చీరలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ఈ నెల 16వ తేదీ వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుంది. ఏపీ నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ గాదె రోశిరెడ్డి, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పీకేఎం పాత్రుడు, పోతిన ప్రసాద్, వరలక్ష్మి, జహనార, మాజీ కార్పొరేటర్ మన్యాల సోంబాబు, జేఎస్ రెడ్డి, శిల్పారామం ఏడీ ఎన్.జ్ఞానశేఖర్, పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి, హ్యాండ్ లూమ్స్ సంస్థ ప్రతినిధి పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సూత్ర వస్త్ర ప్రదర్శన


వస్త్రాలను పరిశీలిస్తున్న యువతులు

బీచ్‌రోడ్డు: బీచ్‌రోడ్డులోని నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన సూత్ర వస్త్ర ప్రదర్శన నగరవాసులను ఆకట్టుకుంటోంది. సంక్రాంతి, వివాహాది వేడుకలు పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో ప్రస్తుత లైఫ్‌స్టైల్‌ను ప్రతిబింబించే వస్త్రాలు అందుబాటులోకి ఉన్నాయి. దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ కళాకారులు రూపొందించిన వస్త్రాలు, ఆభరణాలను ఒకే చోట ప్రదర్శనలో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం రాత్రి 8 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు.

జగనన్న గోరుముద్ద పరిశీలన


భోజనాలు పరిశీలిస్తున్న గొండు సీతారామ్

సీతమ్మధార: పీఅండ్‌టీ కాలనీలోని జీవీఎంసీ ఎన్ఎంసీ హెచ్ హైస్కూల్‌లో జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరును మంగళవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ పరిశీలించారు. విద్యార్థులు, విద్యా శాఖాధికారులు, మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు, అక్షయపాత్ర ప్రతినిధులతో మాట్లాడారు. మొత్తం ఎంత మంది భోజనం స్వీకరిస్తున్నారు.? విద్యార్థుల తల్లిదండ్రులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నారా లేదా? మెనూ తదితర అంశాలపై ఆరా తీశారు. కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకంపై పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం కోఆర్డినేటర్ పరిశీలనకు రావడం లేదని తెలుసుకుని.. విద్యాశాఖ ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. సీతమ్మధార ఎంఈవో డి.రామారావు, అక్షయ పాత్ర ఫౌండేషన్ మేనేజర్ వి.రామ్మోహన్, హెచ్ఎం రాం ప్రసాద్, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పి.రఘు తదితరులు పాల్గొన్నారు.

మిస్ అండ్ మిసెస్ విశాఖ క్వీన్ సందడి


మాట్లాడుతున్న విశాఖ క్వీన్ విజేత దివ్య మచ్చా

సీతంపేట: ఫ్యాషన్ రంగంపై ఉన్న ఇష్టం, కుటుంబ సభ్యుల సహకారంతో మిస్ అండ్ మిసెస్ విశాఖ క్వీన్ పోటీలో విజేతగా నిలిచానని దివ్య మచ్చా అన్నారు. క్వీన్ ఈవెంట్స్ పోటీలో విజేతగా నిలిచి ట్రోఫీని సాధించిన నేపథ్యంలో మంగళవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం చాలా మంది మహిళలు ఫ్యాషన్ రంగంలోకి రావాలంటే భయపడుతున్నారన్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా కెరీర్‌పై ఇష్టంతో ఈ పోటీల్లో పాల్గొన్నానని.. తన ప్రతిభను గుర్తించి విజేతగా ఎంపిక చేశారన్నారు. మహిళలు, యువతుల్లో టాలెంట్ ఉన్నప్పటికీ కుటుంబ సభ్యుల సహకారం, ప్రోత్సాహం లేక ప్రతిభ చూపలేక పోతున్నారన్నారు. క్వీన్ ఈవెంట్స్ నిర్వాహకురాలు ఉషారాణి మాట్లాడుతూ విశాఖలో చాలా మంది టాలెంట్ మహిళలు ఉన్నారని, వారిని ఫ్యాషన్ రంగానికి పరిచయం చేయాలని ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దువ్వాడ మీదుగా సంక్రాంతి స్పెషల్ రైళ్లు



తాటిచెట్లపాలెం: సంక్రాంతి ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్-బ్రహ్మపూర్-వికారాబాద్ మధ్య(వయా దువ్వాడ మీదుగా) స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం ఎ.కె. త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- సికింద్రాబాద్-బ్రహ్మపూర్(07089) స్పెషల్ సికింద్రాబాద్‌లో జనవరి 7, 14 తేదీల్లో రాత్రి 7.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజాము 5.45 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 5.47 గంటలకు బయలుదేరి.. అదే రోజు ఉదయం 11.15 గంటలకు బ్రహ్మపూర్ వెళ్తుంది. బ్రహ్మపూర్-వికారాబాద్(07090) స్పెషల్ జనవరి 8, 15వ తేదీల్లో బ్రహ్మపూర్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి.. అదేరోజు సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 5.12 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు వికారాబాద్ వెళ్తుంది.
- వికారాబాద్-బ్రహ్మపూర్(07091) స్పెషల్ జనవరి 9, 16వ తేదీల్లో సాయంత్రం 6 గంటలకు బయలుదేరి.. మరుసటి రోజు తెల్లవారు 5.45 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 5.47 గంటలకు బయలుదేరి అదేరోజు ఉదయం 11.10 గంటలకు బ్రహ్మపూర్ వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో జనవరి 10, 17వ తేదీల్లో బ్రహ్మపూర్‌లో మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి సాయంత్రం 5.10 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 5.12 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

మారిన కోచ్‌లతో స్పెషల్ రైళ్లు: విశాఖపట్నం-కర్నూలు సిటీ-విశాఖపట్నం స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 1-సెకండ్ ఏసీ, 3-థర్డ్ ఏసీ, 10-స్లీపర్ క్లాస్, 4-జనరల్ సెకండ్ క్లాస్, 2-సెకండ్ సిటింగ్ కం లగేజీ కోచ్‌లతో నడుస్తుందని గతంలో ప్రకటించారు. కానీ ఈ కోచ్‌ల కూర్పును మార్చారు. ఆయా రోజుల్లో ఈ ప్రత్యేక రైలు 1-ఫస్ట్ ఏసీ, 2-సెకండ్ ఏసీ, 7-థర్డ్ ఏసీ, 6-స్లీపర్ క్లాస్, 3-జనరల్ సెకండ్ క్లాస్, 1-సెకండ్ క్లాస్ కం లగేజీ, దివ్యాంగ, 1-జనరేటర్ మోటార్ కార్ కోచ్‌లతో నడుస్తుంది

- శ్రీకాకుళంరోడ్-వికారాబాద్-శ్రీకాకుళం రోడ్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 1-సెకండ్ ఏసీ, 3-థర్డ్ ఏసీ, 10-స్లీపర్ క్లాస్, 4-జనరల్ సెకండ్ క్లాస్, 2-సీటింగ్ కం లగేజీ కోచ్‌లతో నడుస్తుందని గతంలో ప్రకటించారు. కానీ ఈ రైలు మారిన కోచ్‌ల కంపోజిషన్ ప్రకారం 1-ఫస్ట్ ఏసీ, 2-సెకండ్ ఏసీ, 7-థర్డ్ ఏసీ, 6-స్లీపర్ క్లాస్, 3-జనరల్ సెకండ్ క్లాస్, 1-లగేజీ కం దివ్యాంగ, 1-జనరేటర్ మోటార్ కార్ కోచ్‌లతో నడుస్తుంది. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని సీనియర్ డీసీఎం కోరారు.

సూరత్-బ్రహ్మపూర్ స్పెషల్ పొడిగింపు : సూరత్-బ్రహ్మపూర్-సూరత్ మధ్య నడుస్తున్న స్పెషల్ రైలు.. ప్రయాణికుల సౌకర్యార్థం మరో మూడు ట్రిప్పు లు పొడిగిస్తున్నట్లు త్రిపాఠి తెలిపారు. సూరత్-బ్రహ్మపూర్ (09069) స్పెషల్ రైలు ఈ నెల 17, 24, 31వ తేదీల్లో సూరత్‌లో మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరుతుంది. మరుసటి రోజు రాత్రి 8.10 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 8.12 గంటలకు బయలుదేరింది. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.15 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. బ్రహ్మపూర్-సూరత్ (09070) స్పెషల్ బ్రహ్మపూర్‌లో ఈ నెల 19, 26 ఫిబ్రవరి 2 తేదీల్లో తెల్లవారు 3.30 గంటలకు బయలుదేరి.. అదే రోజు ఉదయం 8.20 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.22 గంటలకు బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 1.45 గంటలకు సూరత్ వెళ్తుంది.